# 'కార్పొరేషన్'పై అసంతృప్తి!

## చిచ్చుపెట్టిన కాంగ్రెస్ పదవులు • ఎంపీ, ఎమ్మెల్సీ ఆశలపై నీళ్లు

- కార్పొరేషన్ పదవులతోనే సరి
- పార్టీ కోసం సుదీర్ఘ కాలంగా పనిచేసిన వారికి మొండిచేయి
- పార్టీ ఓటమి కోరుకున్న వారికి పెద్దపీట
- ఒకే సామాజిక వర్గానికి 13 పదవులు
- పాత తేదీలతో చైర్మన్ల నియామకం.. జీవో జారీ కాకపోవడంపై అనుమానం
- ఎంపీ ఎన్నికల నేపథ్యంలో బుజ్జగింపుకేనని నేతల అనుమానం

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): అధికార కాంగ్రెస్ పార్టీ నేతల్లో అసంతృప్తి మళ్లీ రాజుకుంది. నామినేటెడ్ పోస్టులు పార్టీ నేతల్లో చిచ్చురేపాయి. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజునే ప్రభుత్వం అనధికారికంగా విడుదల చేసిన నామినేటెడ్ పదవుల జాబితా కొందరికి మోదం కలిగిస్తే మరికొందరికి ఖేదం మిగిల్చింది. తమ సేవలను కార్పొరేషన్ పదవులకు పరిమితం చేసేశారని కొందరు, ప్రాధాన్యం లేని పదవులు కట్టబెట్టారని మరికొందరు రగిలిపోతున్నారు. ఒకరిద్దరు నేతలు పదవిని తిరస్కరించినట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత శనివారం రాత్రి కార్పొరేషన్ పదవుల పంపకంపై కాంగ్రెస్ నేతలు మీడియాకు లీకులు ఇచ్చారు. ఈ నెల 14నే 37 మంది నేతలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చారని, దీనికి సంబంధించి ఉత్తర్వులు కూడా వెలువడ్డాయని మీడియా సంస్థలకు 16న రాత్రి అనధికారికంగా ఓ జాబితాను పంపారు. సాంకేతిక కారణాల కారణంగానే జీవో ఇవ్వలేదని పేర్కొన్నారు. పదవులు దక్కిన కొందరికి పార్టీ నేతలు, మంత్రులు స్వయంగా ఫోన్ చేసి చెప్పగా, మరికొందరు మీడియా ద్వారా తెలుసుకోవడం గమనార్హం.

### ఒకటి అనుకుంటే మరోటి

ఎమ్మెల్సీ లేదంటే ఎంపీ టికెట్ వస్తుందని ఆశించిన నేతల పేర్లు కార్పొరేషన్ పదవుల జాబితాలో కనిపించడంతో వారంతా అయోమయంలో పడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ ఆశించి భంగపడిన పటేల్ రమేశ్‌రెడ్డి, లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ ఆశించారు. అదీ కుదరకుంటే ఎమ్మెల్సీ అయినా ఇవ్వాలని కోరారు. ఆయన ఆశలన్నీ తలకిందులయ్యాయి. తనను టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినట్టు జాబితా చూసి తెలుసుకుని లబోదిబోమంటున్నారు. లోక్‌సభకు పోటీచేయాలని పట్టుదలగా ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కే శివసేనా రెడ్డికి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పదవి ఇచ్చారు. పార్టీ ప్రతిపక్షంలో ఉండగా పదేండ్లు పనిచేశానని, మరో ఐదేండ్లు కూడా పనిచేయడానికి సిద్ధమని, కానీ ఈ పదవిని మాత్రం తీసుకునే ప్రసక్తే లేదని ఆయన చెప్పినట్టు తెలిసింది. తన ఆసక్తికి అది సరిపడదని, కనీసం సివిల్ సప్లై కార్పొరేషన్ పదవి ఇచ్చినా బాగుండేదని సన్నిహితుల వద్ద వాపోయినట్టు తెలిసింది. ఖమ్మం జిల్లాలో పార్టీ కోసం మొదటి నుంచీ పనిచేస్తున్న జావెద్‌కు కార్పొరేషన్ పదవుల్లో చోటు దక్కకపోవడంపై గుర్రుగా ఉన్నారు. ఖమ్మం నగర పార్టీ అధ్యక్షుడిగా ఉన్న ఆయన అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు ఖమ్మం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్నారు. ఆ తర్వాత తుమ్మల పార్టీలో చేరడంతో జావెద్ తన స్థానాన్ని త్యాగం చేశారు. కార్పొరేషన్ పదవుల ద్వారా అయినా గౌరవిస్తారనుకుంటే అక్కడా నిరాశే మిగిలింది. జావెద్‌కు పదవి లభించకపోవడంపై ఖమ్మంలో మైనార్టీలు ఆదివారం నిరసన తెలిపారు. పొంగులేటి, తుమ్మల కలిసి జిల్లాలో పార్టీని సర్వనాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### విజయబాబుకు టికెట్ ఎలా ఇస్తారు?

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ వర్గపోరు చల్లారడం లేదు. జావెద్‌ను పదవి వరించకపోవడానికి ఇదే కారణమని చెప్తున్నారు. పార్టీకి తొలి నుంచి అండగా ఉన్న జావెద్‌కు కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరుడు మొవ్వ విజయబాబుకు విద్య, మౌలిక వసతుల కల్పన సంస్థ చైర్మన్ పదవిని ఇప్పించుకున్నారన్న ప్రచారం జరుగుతున్నది. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి వర్గానికి ఇది రుచించడం లేదు. తనను ఓడించేందుకు ప్రయత్నించిన వ్యక్తికి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఎలా ఇస్తారని ఎమ్మెల్యే వర్గ నేతలు, కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మనిషిగా పేరున్న నాయుడు సత్యనారాయణకు ఎలాంటి ప్రాధాన్యం లేని హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి ఇవ్వడం భట్టికి రుచించడం లేదు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తమ వారికి పదవులు ఇప్పించుకోగలిగినా, సీనియర్ నేత, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వర్గానికి మాత్రం నిరాశే మిగిలింది. ఆయనను నమ్ముకొని పార్టీలో చేరిన సాదు రమేశ్‌రెడ్డి, కమర్తపు మురళి, బాలసాని లక్ష్మీ నారాయణ వంటివారు ఏదో ఒక కార్పొరేషన్ పదవి రాకపోతుందా అని ఎదురు చూశారు. శనివారం జిల్లాకు మొత్తం 5 కార్పొరేషన్ పదవులు ఇస్తే మంత్రి తుమ్మల వర్గానికి చెందిన వారిలో ఒకరికి కూడా పదవి రాలేదు. ఇది ఆయన వర్గాన్ని నిరాశలోకి నెట్టేసింది.

### బాలరాజు వర్సెస్ రవీందర్‌రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ టికెట్ ఆశించి భంగపడిన కాసుల బాలరాజుకు ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి పాలైన ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గాన్ని ఇది తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ఎన్నికల సమయంలో పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి తన ఓటమి కారణమైన బాలరాజుకు పదవి ఇచ్చి తనను విస్మరించడంపై రవీందర్‌రెడ్డి తన ఆత్మీయుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పదవి ఇచ్చిన గిరిధర్ రెడ్డి పార్టీకి చేసిన సేవలు ఏంటని ప్రశ్నిస్తున్నారు. సామ రామ్మోహన్‌రెడ్డి వంటివారికి ఆ పదవి ఇవ్వాల్సిందని పేర్కొన్నారు. పార్టీకి ఎలాంటి సేవ చేయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన అనుచరుడు ఎంఏ ఫహీంకు పదవి ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు.

### 37లో 13 వారికే

ప్రభుత్వం మీడియాకు ఇచ్చిన లీకులో మొత్తం 37 కార్పొరేషన్ల పదవులను భర్తీచేసినట్టు చెప్పగా ఆయా పదవుల్లో 13 మంది రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే కావడం గమనార్హం. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెద్దగా ప్రాధాన్యం కార్పొరేషన్లు కట్టబెట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఉత్తుత్తి పోస్టులేనా?

ప్రభుత్వం శనివారం రాత్రి లీకు ఇచ్చిన 37 కార్పొరేషన్ పోస్టులు భర్తీచేసినట్టు చెప్తున్నప్పటికీ జీవోలు ఇవ్వకపోవడంపై నేతలు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికలకు ముందు పార్టీ నేతల్లో అసంతృప్తి తలెత్తకుండా ఉండేందుకే ఈ ఉత్తుత్తి పదవులు కట్టబెట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. నిజంగానే పదవులు ఇచ్చి ఉంటే జీవో ఇచ్చి ఉండేవారు కదా అని ప్రశ్నిస్తున్నారు. ఇదేమీ లేకపోవడం చూస్తుంటే ఉత్త ముచ్చటలానే ఉన్నదని అంటున్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కార్పొరేషన్ పదవులపై మాట్లాడకపోవడం అనుమానులకు తావిస్తున్నదని చెప్పుకుంటున్నారు.

## పదవుల్లో మాలలకు అన్యాయం

- ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సైదులు

సికింద్రాబాద్, మార్చి 17: కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో మాలలకు, మాల ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉస్మానియా యూనివర్సిటీ ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు నామ సైదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో మాల కులస్తులకు ఒక్క చైర్మన్ పదవి కూడా ఇవ్వకపోవడం దారుణమని మండిపడ్డారు. ఆదివారం ఓయూలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇదే కులానికి చెందిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు తమ కులాలకు చెందిన ఒక్కరికి కూడా కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వకపోవడం సిగ్గుమాలిన చర్యగా పేర్కొన్నారు. గత కేసీఆర్ సర్కార్ మాలలకు కొన్ని కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాలలను పూర్తిగా విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా మాలలకు న్యాయం చేయకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో మాలలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పుతామని ఆయన హెచ్చరించారు.

# ఎంపీలు దొంగలైతే.. మీరెలా చేర్చుకున్నారు?

మొదటిపేజీ తరువాయి...

ఒక్కటి బీఆర్ఎస్‌ను బలహీనపర్చాలని కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. 'పార్లమెంట్‌లో చంద్రబాబు గురించి మాట్లాడాల్సి వస్తే, తెలంగాణలో కేసీఆర్ బ్రహ్మాండంగా పనిచేస్తున్నారని కొనియాడారు. మిషన్ భగీరథ ప్రారంభోత్సవంలో మోదీ ప్రశంసలు కురిపించలేదా? ఇదేం దొంగనీతో బీజేపీనే చెప్పాలి. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దొంగపాలన పోతుందనుకుంటే, గజదొంగల పాలన వచ్చిందని అన్నారు. మరి బీఆర్ఎస్ దొంగల పార్టీ అయితే, మా నేతల ఇంటి ముందు కిషన్‌రెడ్డి నైట్‌వాచ్‌మన్ ఉద్యోగం ఎందుకు చేస్తున్నారు? బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి బీజేపీ ఎంపీ టికెట్లు ఇస్తున్నారు? దొంగలకే బీజేపీ టికెట్లు ఇస్తున్నదా?' అని నిలదీశారు. ఆదిలాబాద్‌లో నగేశ్, జహీరాబాద్‌లో బీబీపాటిల్, మహబూబ్‌నగర్‌లో రాములు కుమారుడికి, నల్లగొండలో సైదిరెడ్డి.. వీళ్లంతా బీఆర్ఎస్ నుంచి వెళ్లినవారేనని, వారికే టికెట్లు ఇచ్చారని వెల్లడించారు. బీఆర్ఎస్‌ను ప్రశ్నించే నైతిక అర్హత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి లేదని ధ్వజమెత్తారు.

### దళితుల భూములు గుంజుకున్న దొంగ ఈటల

ఇప్పుడే ఆట మొదలైందని, దమ్మోంటో చూపుతామని దళితుల భూములను గుంజుకున్న దొంగ ఈటల రాజేందర్ మాట్లాడటం సిగ్గుచేటు అని రావుల నిప్పులు చెరిగారు. హుజురాబాద్‌లో, గజ్వేల్‌లోనే ఆయన దమ్మోంటో తెలిసిపోయిందని విమర్శించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో మల్కాజిగిరి ఎంపీ టికెట్ సంపాదించిన ఈటలకు కొద్దిగానైనా ఆత్మగౌరవం ఉన్నదా? అని ప్రశ్నించారు. కుటుంబ రాజకీయాల గురించి బీజేపీ మాట్లాడటం సిగ్గుచేటు అని ఎద్దేవా చేశారు. ఆదివాసీ బిడ్డ బాపూరావు ఆదిలాబాద్‌లో గెలిస్తే కనీస గౌరవం ఇవ్వలేదని, ఈ సారి టికెట్ కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణ పేరిట మాదిగలను మోసం చేస్తున్నారని, పదేండ్లుగా ఏం చేశారని ధ్వజమెత్తారు. దళితుల కోసం దళితబంధు పెట్టిన చరిత్ర బీఆర్ఎస్‌ది అని, ఏకైక నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. బీజేపీకి నిజంగా దళితులపై ప్రేమ ఉంటే దేశం మొత్తం దళిత బంధు అమలు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టో పెడుతుందా? అని సవాల్ విసిరారు.

### బీజేపీకి ఓటెందుకు వేయాలి?

అసలు బీజేపీకి తెలంగాణ సమాజం ఎందుకు ఓటేయాలని శ్రీధర్‌రెడ్డి నిలదీశారు. పసుపు బోర్డు అటే పోయిందని, కరీంనగర్‌లో తట్టెడు మట్టి ఎత్తిపోయలేదని, సికింద్రాబాద్‌లో మూడు లిఫ్టులు, పవర్‌బోర్డులు తప్ప కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మొదలు అనేక విభజన హామీలను ఎందుకు అమలు చేయలేదని, ఎందుకు ఓటేయాలో చెప్పి ఓట్లు అడగాలని బీజేపీని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అంతరించిపోతుందని బీజేపీ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. బీఆర్ఎస్‌కు 39 మంది ఎమ్మెల్యేలు, 20కిపైగా ఎమ్మెల్సీలు, పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు సభ్యులు ఉన్నారని, అయినా పార్టీ అంతరించిపోతుంది అనటం వారి అవివేకానికి నిదర్శనమని తెలిపారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టు తర్వాత పార్టీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలు బీజేపీ వైఖరిని, మోదీ నిరంకుశత్వాన్ని ఎండగట్టారని వివరించారు.

### ఆరు గ్యారెంటీలు ఎక్కడ అమలయ్యాయి?

అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతున్నారని కాంగ్రెస్‌పై రావుల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలు అమలు అయ్యాయా? అనేది రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. 2 లక్షల రుణమాఫీ ఏమైందని, రైతుబంధు ఇప్పటి వరకు పడలేదని విమర్శించారు.వరి పంటకు రూ.500 బోనస్ ఏమైందని, మహిళలకు రూ.2,500 ఇస్తామని మాట తప్పారని, పింఛన్లు పెంచలేదని మండిపడ్డారు. గృహజ్యోతికి ఏడాదికి రూ.5 వేల కోట్లు అవసరమైతే, రూ.2,500 కోట్లు పెట్టారని, దాని అమలు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. మన ఊరు మన బడికి బిల్లులు చెల్లించకపోవటం సంగతి పక్కన పెడితే కనీసం సమీక్ష కూడా చేయడం లేదని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క పిల్లర్ కుంగిపోతే మొత్తం ప్రాజెక్టును పక్కన పెట్టిందని, రైతుల పంటలు ఎండిపోవడానికి రేవంత్ సర్కార్ కారణమని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక గ్రామాల్లో కరెంటు కోతలు మొదలయ్యాయని, మోటర్లు కాలిపోతున్నాయని వెల్లడించారు. రేవంత్‌రెడ్డి, బీజేపీ ఫెవికాల్ బంధం ప్రజలకు అర్థమైందని.. ఆ పార్టీలకు ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్తారని తెలిపారు. బీజేపీ కుటిల నీతిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని, కాంగ్రెస్ వైఫల్యాలను వివరించి ఓట్లను అడుగుతామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## నేడు సుప్రీంకు ఎమ్మెల్సీ కవిత భర్త

మొదటిపేజీ తరువాయి...

సమాచారం. విచారణను అధికారులు వీడియో రికార్డు చేసినట్టు తెలిసింది. విచారణ అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఆమె భర్త అనిల్, న్యాయవాది మోహిత్‌రావు కవితను కలిశారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు తాను సమాధానం చెప్తూనే తనపై మోపిన అభియోగాలన్నీ అభియోగాలుగానే మిగిలిపోతాయని, తాను కడిగిన ముత్యంలా బయటికొస్తానని ఆమె వారితో పేర్కొన్నట్టు సమాచారం. కాగా, సోమవారం ఎమ్మెల్సీ కవిత సమీప బంధువులు, ఆమె వ్యక్తిగత సిబ్బంది కొందరు ఆమెను కలిసే అవకాశం ఉన్నది.

## ఎమ్మెల్సీ కవిత నిర్దోషి: నాగం జనార్దన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యంలా, నిర్దోషిగా బయటకొస్తారని బీఆర్ఎస్ సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ మద్యం కేసు విషయంలో కవితను విచారించాలా? వద్దా? అని సుప్రీంకోర్టులో వాదనలు జరుగుతుండగా ఈడీ అధికారులు ఆమెను ఎలా అరెస్టు చేస్తారంటూ ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆమెను అరెస్టు చేశారని పేర్కొన్నారు. దీని వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని తెలిపారు. న్యాయస్థానాల మీద తమకు పూర్తిగా నమ్మకమున్నదని, ఈ కేసులో ఆమె నిర్దోషిగా నిలుస్తారని పేర్కొన్నారు.

PRATHIBHA INNOWIS IAS
TSPSC GROUP-1
FREE CLASSES (ONLINE & OFFLINE)
PRELIMS BATCH STARTS ON 22.3.2024
INTER + CLAT /IPM / CUET
DEGREE + IAS (3 YRS. INTEGRATED COURSE)
Interested PROs Call :7374837937
ప్రతిభ GROUP OF COLLEGES KUKATPALLY, HYD.

## వ్యాపారులకు రేవంత్ బ్లాక్‌మెయిల్

- నడమంత్రపు సిరిలా సీఎం పదవి
- ఫోన్ ట్యాపింగులకు పాల్పడుతున్నాడు
- బీజేపీ నేత ఈటల సంచలన ఆరోపణలు

జూబ్లీహిల్స్, మార్చి 17: రాహుల్ గాంధీకి ఫండ్స్ పంపటానికి రాష్ట్రంలోని వ్యాపారులను సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు. వ్యాపారులను ఆయన బెదిరిస్తున్న చిట్టా రికార్డు అవుతున్నదని అన్నారు. పిల్లి కండ్లు మూసుకొని పాలు తాగినట్టు రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.ఆదివారం మీడియాతో మాట్లాడిన ఈటల.. రాష్ట్రంలో అన్నీ తానేనని రేవంత్ విర్రవీగుతున్నారని, దానికి తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడుతూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. నడమంత్రపు సిరిలా ముఖ్యమంత్రి పదవి వచ్చిన రేవంత్.. రెండు నాల్కల ధోరణితో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని, ఏదిపడితే అది మాట్లాడితే ప్రజలు సహించటానికి సిద్ధంగా లేరని హెచ్చరించారు. మల్కాజిగిరిలో ఎవరు వచ్చినా, ఎంత డబ్బు ఖర్చు పెట్టినా గెలిచేది బీజేపీయేనని పేర్కొన్నారు.

## పార్టీ మారితే రాళ్లతో కొట్టమన్నావ్?

- ఉరితీసే చట్టాలు చేయాలన్నవ్..
- కాంగ్రెస్‌లో చేరిన వారిని అదే చేస్తారా?
- సీఎం రేవంత్‌కు దాసోజు సూటి ప్రశ్న
- నిస్సిగ్గుగా ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని ధ్వజం

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్

ఖైరతాబాద్, మార్చి 17: 'ఒక పార్టీపై గెలిచి.. స్వార్థం కోసం మరో పార్టీలో చేరిన వారిని రాళ్లతో కొట్టిచంపాలి.. అలాంటి వారి కోసం ఉరితీసే చట్టాలు తీసుకురావాలని ప్రగల్భాలు పలికారు.. ఇప్పుడు మీ పార్టీలో చేరిన వారికి అదే శిక్షలు వేస్తారా' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ ప్రశ్నించారు. నాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో గాంధీభవన్ సాక్షిగా మాట్లాడిన వ్యక్తి నేడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ తన నిజస్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చెప్పేది శ్రీరంగ నీతులు, చేసేది పరమ ఛండాలమైన పనులు అన్న విధంగా సీఎం రేవంత్ వ్యవహారశైలి కనిపిస్తున్నదని చెప్పారు. పార్టీ ఫిరాయింపులను నిర్లజ్జగా, నిస్సిగ్గుగా ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు చట్టాలకు లోబడి పార్టీలను విలీనం చేసి, బీఆర్ఎస్‌లో నాడు చిల్లర మాటలు మాట్లాడారని గుర్తుచేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మరికొందరిని కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై ఏమనాలని ప్రశ్నించారు. నాడు రేవంత్‌రెడ్డి అన్న మాటల రికార్డులు డిజిటల్ మీడియాల్లో ఉన్నాయని, దానం నాగేందర్ పంజాగుట్టలో బీడీలు అమ్ముకున్నాడన్న ఆరోపణ నిజం కాదా? అని ప్రశ్నించారు. పార్టీ కార్యకర్తల చెమట చుక్కలపై గెలిచి ఫిరాయించిన వారిని వదిలి పెట్టబోమని, రాజ్యాంగ, ప్రజాస్వామ్యబద్ధంగా వారికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. త్వరలోనే డిస్‌క్వాలిఫికేషన్ పిటిషన్‌ను కోర్టులో వేస్తామని, వారికి రాజకీయ సమాధి తప్పదని స్పష్టం చేశారు.

### ఏ ముఖం పెట్టుకొని వెళ్లావ్ దానం?

నాడు బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాడు కాంగ్రెస్ చేస్తున్న అన్యాయంపై పలు ఆరోపణలు గుప్పించి, నేడు అదే పార్టీలోకి ఏ ముఖం పెట్టుకొని వెళ్తున్నావని ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను శ్రవణ్‌కుమార్ ప్రశ్నించారు. 2018 జూన్ 22న కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడి హోదాలో ఆ పార్టీకి ఇచ్చిన రాజీనామా లేఖలో అనేక విషయాలు ఉన్నాయని చెప్పారు. 50 శాతం బీసీల సంక్షేమాన్ని కాంగ్రెస్ విస్మరించిందని, ఒకే ఒక్క సామాజికవర్గానికి ప్రాబల్యం, ప్రాతినిధ్యం కల్పించడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలు అణిచివేతకు గురవుతున్నారని దానం ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ఎన్నికలకు ముందు తన సామాజికవర్గానికే ప్రాధాన్యం ఇస్తానంటూ ప్రకటించాడని గుర్తు చేశారు. అన్నట్టుగానే 50 శాతం టికెట్లు, 40 శాతం కార్పొరేషన్ సీట్లు ఆయన సామాజిక వర్గానికే ఇచ్చాడని విమర్శించారు. 119 నియోజకవర్గంలో బీసీలకు ఇచ్చిన వాటా ఎంత? అని ప్రశ్నించారు. ఇప్పుడు అదే పార్టీలోకి ఎలా వెళ్లావ ప్రశ్నించారు. దానం నాగేందర్ బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. తన ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర జరుగుతుందని పదే పదే వ్యాఖ్యానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా ఆయన పార్టీని చూసుకోవాలని, ఇప్పటికే ఆ పార్టీలో ఎందరికో సీఎం కావాలన్న కోరికతో ఉన్నట్టు తెలుస్తున్నదని చెప్పారు. ఫిరాయింపులకు పాల్పడకుండా ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విప్లవ్ కుమార్ ఉన్నారు.

# పాలమూరుకు బ్రేక్!

మొదటిపేజీ తరువాయి...

తమ వద్ద అందుబాటులో లేదని వెల్లడించింది. అదేవిధంగా పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు సంబంధించిన డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ అనుమతుల కోసం 2022 సెప్టెంబర్13న సమర్పించారని కేంద్ర జల్‌శక్తిశాఖ వెల్లడించింది. అయితే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కృష్ణా జలాలపై ఆధారపడి ఉన్నదని, అదే సమయంలో ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల కృష్ణా జలాలను, ఏపీ, తెలంగాణ మధ్య పునఃపంపిణీ చేయాలని 2023 అక్టోబర్ 6న కేంద్ర జల్‌శక్తిశాఖ నూతన మార్గదర్శకాలను జారీ చేసిందని గుర్తుచేసింది. నూతన టీవోఆర్ ప్రకారం కృష్ణాజలాల పంపిణీ ట్రిబ్యునల్‌లో విచారణ అంశంగా ఉన్నదని వివరించింది. ప్రస్తుతం సబ్ జ్యుడీస్‌గా ఉన్న నేపథ్యంలో ట్రిబ్యునల్ తుది అవార్డు వచ్చే వరకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను పరిశీలించలేమని తేల్చిచెప్పింది. అదేవిధంగా ఈ ప్రాజెక్టును ప్రస్తుతం పీఎంకేఎస్‌వై (ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన), సత్వర సాగునీటి ప్రయోజిత కార్యక్రమం (ఏఐబీపీ) కింద చేర్చాలని చూస్తున్నట్టు సమాధానమిచ్చింది.

### ఆది నుంచీ మోకాలడ్డు

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతుల కోసం తెలంగాణ ప్రభుత్వం 34వ ఈఏసీ సమావేశం నుంచే తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. ఈఏసీ సభ్యులు సందేహాలను లేవనెత్తుతూ, నివేదికలను కోరుతూ వాయిదా వేశారు. ఒక దశలో ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల మంజూరును సైతం తిరస్కరిస్తూ ప్రాజెక్టు ప్రతిపాదనలను పక్కనపెట్టారు. అయినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొక్కవోని దీక్షతో ఈఏసీ కోరిన డాటాను అందించింది. 48వ సమావేశంలో పాలమూరు ప్రాజెక్టు ప్రతిపాదనలపై సుదీర్ఘ చర్చ కొనసాగింది. 49వ ఈఏసీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించింది. ప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకతను బలంగా నొక్కిచెప్పింది. ప్రాజెక్టుకు త్వరితగతిన పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని, కరువు పీడిత ప్రాంతాల దాహార్తిని తీర్చాలని విజ్ఞప్తి చేసింది. ప్రాజెక్టు పర్యావరణ ప్రభావ అంచనాల నివేదికలు పరిశీలించిన ఎక్స్‌పర్ట్ అప్రయిజల్ కమిటీ (ఈఏసీ) ప్రాజెక్టుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ పర్యావరణ అనుమతులు ఇవ్వొచ్చని సంబంధిత మంత్రిత్వశాఖకు 2023 ఆగస్టు 10న సిఫారసు చేసింది. నాటి నుంచి ఆ దస్త్రం కేంద్రం వద్ద పెండింగ్‌లోనే ఉన్నది. అయితే, ఈ ప్రాజెక్టు పనులపై ఏపీలోని కడప జిల్లాకు చెందిన పలువురు ఎన్జీటీని ఆశ్రయించడం, విచారణ చ